అర్ధరాత్రి ...

ఏదో అలికిడయ్యింది!

ఉలిక్కిపడి నిద్ర లేచాను.

గదంతా సన్నని పారదర్శకపు వెలుగు పరుచుకుని ఉంది.

ఆ మసక వెలుతుర్లో ఇంట్లోని సామానంతా మసకమసకగా కనిపిస్తున్నాయి.



# అనుభూతి

- ధనరాజ్ జ్ఞానేశ్వర్

తెరచి ఉంచిన కిటికీ గుండా- మెల్లమెల్లగా అలలు అలలుగా గాలి గదిని చుట్టి వెళుతోంది.

ఆ అర్ధరాత్రి - ఏవో మధురస్మృతులను గాలితో పంచుకుని హాయిగా నవ్వుతున్నట్టనిపించింది.

కిటికీ అంచునే ఉన్న నైట్ క్వీన్ గాలి తాకిడికి సన్నగా కదులుతూ, పరిమళాల సౌరభాల్ని గదంతా చిమ్ముతోంది.

ఇదీ నేను నిద్ర లేచినప్పుడు గదిలో నెలకొని ఉన్న వాతావరణం.

నా పక్కకి చూశాను. గాఢ నిద్రలో ఆయన.

ఆమధ్య వచ్చిన భూకంపం కూడా ఆయనను నిద్ర లేపలేదేమో ...

ఆయనను లేపబోయాను.

"పాపం! ఎంతగా అలసిపోయారో? ఆయన సుఖాన్ని చెడగొట్టడమెందుకు?"

చివరి క్షణాన ఆ ఆలోచన విరమించుకుని, ప్రయత్నం మానుకుని మంచంమీద నుండి లేవబోతుండగా ...

మళ్లీ అదే అలికిడి.

అప్పుడు గ్రహించాను. అవును, ఇందాక అదే అలికిడి. అది అలికిడి కాదు, సన్నని అలజడి.

బయటి ప్రపంచమంతా మెత్తనే మంచు దుప్పటిని కప్పుకొని మాగన్నుగా నిద్రపోతుంటే నేను మాత్రమే మేల్కొన్నానంటే అది అంతర్లీనంగా నాలోకలిగిన అలజడి కాక మరేమిటి?

దానిక్కారణం ఎవరో కాదు, నాలో పెరుగుతున్న శిశువు అల్లరిగా చేస్తోన్న కేరింత.

అప్రయత్నంగా నా చేతులు నా పొట్టను తడిమాయి.

బయటినుండి నా స్పర్శ తాకినప్పుడు, గర్భస్థ శిశువుపులకించిపోయినట్టుగా ఒ...క్క...సా...రి...గా... కుడివైపు నుండి ఎడమవైపుకి తిరిగాడు. తిరిగాడా? తిరిగిందా?

నా నోటినుండి దాబోయిన కేకను అతి

కష్టమ్మీద ఆపుకున్నాను.

ఎంత గమ్మత్తుగా ఉందా కదలిక.

భూమి శతాబ్దాలపాటు తన గర్భంలో దాచుకున్న లావా బయటికి రాకుండా లోపలే అటు ఇటు కదిలితే ఇలాగే ఉంటుందేమో ...

పరిమాణంలో తేడా ఉంటుందేమో గానీ, అనుభూతిలో తేడా ఉండదు కనుకనే, భూమిని 'భూమాత' అన్నారనుకుంటా!

నా హృదయవేదికమీద నరాలని తీగలుగా చేసి, కదలికల వీణని మీటితే అనురాగపు రాగాల్ని సృష్టిస్తోందో కదలిక.

"నాన్నా ...! తప్పురా ...! తప్పమ్మా...! అమ్మనలా కష్టపెట్టొచ్చా!" ఆడో, మగో తెలియని శిశువు కాబట్టి, రెండు రకాలుగా ఊహించుకుని కళ్ళు మ[illegible]కున్నాను.

నా [illegible]రిన ఆ ఫీలింగ్‌కి భయపడ్డైనా నిశ్శబ్దంగా ఉంటుందనుకున్నాను. అలా జరగలేదు.

తల్లిని సతాయించి, మారాం చేసి, తను కోరుకుంది సాధించే అల్లరి కన్నయ్యలా, తన సన్నని, చిన్నని, ఇంకా కఠినత్వం ఆపాదించుకోని సుతిమెత్తని వేళ్లతో నా కడుపు గోడలని సుతారంగా మీటాడు.

పచ్చిదనంతో నిండి ఉన్న ఆ తాకిడిని వర్ణించడానికి నా దగ్గర భాష లేదు.

"అబ్బబ్బ! నీతో వేగలేనే బాబూ!" సుతారమైన విసుగుని ప్రదర్శించి, ముద్దుగా కోప్పడ్డాను ఆ శిశువుమీద.

నాలో అంతర్లీనంగా ఆ శిశువు ఆడయితే బాగుండునన్న కోరిక ఉందేమో, నాకే తెలియదు. లేకుంటే అమ్మాయిని కసిరినట్టుగా ఎందుకు సంబోధిస్తానూ?

నిజానికి అది విసుగు కాదు, ముద్దూ కాదు. అంతకు మించిన గాఢానురాగం.

ఆ అనురాగం పేరు మాధుర్యం. మాతృత్వపు మాధుర్యం ...

"ఏమిటీ? నీలో నువ్వేగొణుక్కుంటున్నావ్?" అన్న మాటలు వినబడితే కళ్ళు తెరిచాను.

ఆయన ఎప్పుడు మేల్కొన్నాడో ... నాకు ఆశ్చర్యమనిపించింది. నిద్రపోతే తెల్లారి, ఏడుగంటలయినా లేవని మనిషికి మెలకువ ఎలా వచ్చిందాని?

"నేనెప్పుడు గొణిగాను?" ఆశ్చర్యం నటిస్తూ అన్నాను కానీ ...

నా కంటిమెరుపు, మొహంలోనిఎరుపు, పెదవిపైవిరుపు - అన్నిటినీ మించి అమ్మదనంలోని కమ్మదనం, దాని తాలూకు గొంతులో ఒలికిన తీయదనం - ఇవన్నీ నే అన్నది అబద్ధమని సునాయాసంగా తేల్చేశాయి.

అతను చిన్నగా నవ్వి, "పిచ్చి సువ్వీ! అర్ధరాత్రి వేళ ఆనందంతో కలవరించి - అడిగితే అబద్ధమాడతావా?" అనంటూ నాక్కాస్త దగ్గరగా జరిగాడు.

ఇద్దరమూ ప్రతిరాత్రీ ఒకటయ్యేదీ ఆ మంచం మీదే! మామధ్య గాలి కూడా చొరబడడానికి వీల్లేదని తీర్మానించుకుని, ఎన్ని రాత్రుళ్లు అలా ఒక్కటిగా ఒదిగిపోయామో తెలియదు.

కానీ ... ఈ మధ్య మా ఇద్దరికీ మధ్య బోల్డంత స్థలం ఖాళీ అవసాగింది.

అయినా నాకు ఏ కోశానా బాధ కలగలేదు. పైగా అదో రకమైన సంతృప్తి, ఆనందం నా కళ్లల్లో ... మనసులో.

శారీరకంగా ఇద్దరమూ కాస్త ఎడమైనా, మానసికంగా మా ఇద్దరి దూరాన్ని తగ్గించే వారధి - నా కడుపులో పెరుగుతోంది.

అదేదో అడ్వర్టైజ్‌మెంట్‌లా - 'ఈ బంధం దృఢమైనది' కాబోతున్నది. ఆయనలా దగ్గరగా జరగ్గానే నేనింకాస్త దగ్గరకు ఒదిగి, మిగిలిన దూరాన్ని చెరిపివేయడానికి ప్రయత్నించాను.

అయినా ఇద్దరి మధ్యా కొంత దూరం మిగిలే ఉంది.

నిస్సహాయంగా ఆయన వంక చూశాను.

ఆయన చిన్నగా నవ్వి, నా కడుపు మీద ముద్దాడుతూ, "భడవా! నాకిష్టమైన నా సువర్చలను నాకు దూరం చేస్తావురా! నువ్వు బయటికి రా! అప్పుడు చెప్తా నీ సంగతి ...!" అన్నారు బెదిరింపుగా.

నేను కిలకిలా నవ్వాను.

నా నవ్వు చూసి ఆయనా నవ్వారు.

"మగాళ్లకెంత స్వార్థమో! ఎప్పుడూ తమ జాతే పెరగాలనుకుంటారు!" అన్నాను ఆయన మాటల్లో వ్యక్తమైన భావాన్ని పట్టి.

అప్పుడు గ్రహించారాయన తాను పిల్లవాడిని దృష్టిలో పెట్టుకుని ఆ మాటలు అన్నానని తోచింది.

"అయాం సారీ! సువ్వీ! ఏదో కాజువల్‌గా అనేశా!" సారీ చెప్పారు.

"లేదులెండి, ఊరికే ..." నవ్వాను నేను.

తిరిగి మామధ్య అవే నవ్వులు.

మా ఇద్దరి నవ్వులని గ్రహించిందో, గమనించాడో ... తెలియదు గానీ లోపలవాడూ/అదీ నవ్వుతున్నాడు/ నవ్వుతోంది.

ఆ నవ్వు నా హృదయాన్ని తాకుతోంది అచ్చంగా ... స్వచ్ఛంగా.

ఏదో పాటలో విన్నాను - 'త్యాగమే ఊపిరై ఆడదయ్యేను తల్లీ ...!' ఆ మాటలు సముద్రపు అలలు ఒడ్డుని స్పృశించినట్టుగా నా మనసునీ తాకుతుంటాయి. తన ప్రాణాన్ని పణంగా పెట్టి, మరోప్రాణికి జన్మనివ్వడానికి ఎందుకంతగా తహతహలాడుతుందో నాకిప్పుడు అర్థమవుతోంది.

ఈ అనుభూతి పొందే ప్రయత్నంలో - ఈ క్షణం చావు ఎదురైనా ఆనందంగా ఆహ్వానించే ధైర్యం నాలో మెల్లమెల్లగా కలుగుతోంది.

ఈ అనుభవం ... మరోసారి ... మరోసారి పొందడం కూడా నాకానందమే!

